సాక్షి ఖమ్మం

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



'సుకన్య సమృద్ధి'లో టాప్

పోస్టల్ శాఖ ద్వారా అమలుచేస్తున్న సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరిపించడంలో ఖమ్మం డివిజన్ ముందంజలో నిలిచింది. 10లో



నారాయణ స్కూల్‌కు సెలవు!

నిబంధనలు అతిక్రమిస్తున్న నారాయణ పాఠశాల తీరుపై 'సాక్షి'లో వచ్చిన కథనంతో అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టారు. 11లో

గరిష్టం / కనిష్టం
35° / 16°

వాతావరణం

బుధవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉదయం పలు ప్రాంతాల్లో చలి, పొగ మంచు ప్రభావం కనిపిస్తాయి.

న్యూస్‌రీల్

'మన ఊరు - మన బడి' పనుల్లో వేగం పెంచాలి



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత

తిరుమలాయపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు చేపట్టిన మన ఊరు – మన బడి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ స్నేహలత ఆదేశించారు. మండలంలోని పిండిప్రోలు, జల్లెపల్లి, పాతర్లపాడు, సుబ్లేడు గ్రామాల పాఠశాలలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. పిండిప్రోలు, సుబ్లేడు పాఠశాలల్లో పనులు ఆలస్యమవుతుండడంపై అధికారులను మందలించారు. అనంతరం ఆర్ అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌తో పనులపై సమీక్షించిన అదనపు కలెక్టర్ త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ రాజేశ్వరి, సర్పంచ్‌లు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో 107 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 19,198మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జనరల్ విభాగంలో 81 పరీక్షా కేంద్రాలకు గాను 14,435మంది, ఒకేషనల్‌కు 26 కేంద్రాలకు గాను 4,763మంది విద్యార్థులు హాజరవుతారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రవిబాబు పరీక్షల కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా డీఈసీ మెంబర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించనున్నారు.

ఎస్‌ఎంసీల ఖాతాల్లో అల్పాహారం నిధులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం నుంచి అల్పాహారం అందించనున్నారు. ఈమేరకు మంజూరైన నిధులను పాఠశాలల వారీగా ఎస్‌ఎంసీ ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. 213 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న 7,067 మంది విద్యార్థులకు గాను సాయంత్రం అల్పాహారం అందించేందుకు 36,04,170 మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈమేరకు విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించాలని డీఈఓ సూచించారు.

16న జిల్లాస్థాయి చెస్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 16న జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కేవలం మహిళలకు మాత్రమే పోటీలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాల కోసం 96187 18929 నంబర్లలో సంప్రదించాలని డీవైఎస్‌ఓ సూచించారు.

70 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించారు. ఈమేరకు స్లాట్ బుక్ చేసుకున్న 139 మందిలో 117 మంది హాజరయ్యారు. వీరిని ఆర్థోపెడిక్, కంటి, మానసిక, ఈఎన్‌టీ వైద్యులు పరీక్షించి 70 మందిని సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హులుగా గుర్తించారు.

'టీ హబ్'లో నిలిచిన పరీక్షలు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌లో పలు రకాల పరీక్షలు మంగళవారం నిలిచిపోయాయి. పరీక్షలు నిర్వహించటానికి అవసరమైన రసాయనాలు అడుగంటడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రధానంగా థైరాయిడ్, యూరిక్ యాసిడ్‌తో పాటు ఇన్‌ఫెక్షన్ టెస్టులు నిలిచిపోగా ఆస్పత్రికి వచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పేద ప్రజలకు 57 రకాల పరీక్షలు ఉచితంగా చేసేలా తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటుచేశారు. కొంతకాలం ఎలాంటి ఆటంకాలు లేకుండా పరీక్షలు నిర్వహించగా, ఇటీవల తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. రసాయనాల సరఫరా లేకపోవడంతో యంత్రాలు మొరాయిస్తుండడంతో ప్రస్తుతం పది రకాల పరీక్షలు నిలిచిపోయాయి.

వామ్మో.. అంత కట్టలేం!

ఖమ్మంలోని కొత్తగూడెంకు చెందిన ఎం.మౌనిక కుటుంబం ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తోంది. ఇటీవల క్రమబద్ధీకరణ కోసం 59 జీఓ ఆధారంగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే, క్రమబద్ధీకరించాలంటే రూ.27లక్షలు చెల్లించాలని అధికారులు నోటీసు జారీ చేశారు. నిరుపేదలమైన తాము ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించుకుంటే... ఇప్పుడు రూ.27లక్షలు చెల్లించాలని చెప్పడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంత డబ్బు ఉంటే ప్రైవేట్ భూమి కొనుగోలు చేసి ఇల్లు కట్టుకునే వాళ్లం కదా అని కదా ప్రశ్నిస్తున్నారు.

- 59 జీఓపై దరఖాస్తుదారుల ఆవేదన
- వాయిదాల్లోనైనా చెల్లించాలని అధికారుల అవగాహన
- అయినా ముందుకు రాని పలువురు



దరఖాస్తుదారులకు అవగాహన కల్పించేందుకు పర్యటిస్తున్న అధికారుల బృందం

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వ భూముల్లో 2014 ఏడాది కంటే ముందు ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం జీఓ 58, 59 జారీ చేసింది. 58 జీఓ ద్వారా నిరుపేదలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే ఉచితంగానే క్రమబద్ధీకరిస్తామని ప్రకటించగా.. 59జీఓ ఆధారంగా మాత్రం ప్రస్తుతం మార్కెట్ ధర చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం జిల్లాలోనే అత్యధికంగా ఖమ్మం నగరంలో(ఖమ్మం అర్బన్) దరఖాస్తులు వచ్చాయి. ఆయా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రెవెన్యూ అధికారులు అర్హుల సంఖ్య తేల్చారు.

బదలాయింపు

ఇంటింటి సర్వే చేపట్టిన అధికారులు 58, 59 జీఓల ద్వారా క్రమబద్ధీకరణకు ఎందరు అర్హులో లెక్కలు వేశారు. అయితే, 58జీఓ ద్వారా దరఖాస్తు చేసుకున్న పలువురు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కువ గజాలు కలిగి ఉండడంతో వారి దరఖాస్తులను 59 జీఓలోకి బదలాయించారు. ఇలా 58 జీఓ ద్వారా మండలంలో 5,492 దరఖాస్తులు అందగా, అందులో 2,435 మందిని అర్హులుగా గుర్తించి వారికి క్రమబద్ధీకరణ పత్రాలు సిద్ధం చేశారు. ఇక 382 దరఖాస్తులను 59 జీఓలోకి బదలాయించి మిగతావి తిరస్కరించారు. కాగా, 59జీఓ ద్వారా 725 మంది దరఖాస్తులు అందాయి. వీరు తమ ఇంటి పత్రాలు, వివరాలను దరఖాస్తుతో జత చేయగా, ప్రభుత్వానికి క్రమబద్ధీకరణ ఫీజుగా మార్కెట్ ధర ప్రకారం రూ.13.62 కోట్ల మేర చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈమేరకు నెల క్రితమే నోటీసులు జారీ చేశారు.

వచ్చింది రూ.62లక్షలే...

59 జీఓ ఆధారంగా ఇళ్ల యజమానులు స్థలాల క్రమబద్ధీకరణ కోసం మార్కెట్ ధర ప్రకారం రూ.13.62కోట్లు చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేయగా పెద్దగా స్పందన రావడం లేదు. మొత్తం 725 దరఖాస్తుల్లో 393మందిని అర్హులుగా గుర్తించి, 155 మందికే నోటీసులు జారీ చేశారు. అయితే, ఇందులో 20మంది మాత్రమే రూ.62.91 లక్షలు చెల్లించారు. మార్కెట్ ధర ప్రకారం స్థలం ఖరీదును తాము చెల్లించాలని చెప్పడం సరికాదని వారు వాపోతున్నారు. అలా కాకుండా ప్రభుత్వ ధరల ప్రకారం వసూలు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇటీవల కలెక్టర్ గౌతమ్ అధికారులతో సమావేశమై ఒకేసారి కాకుండా వాయిదాల పద్ధతిలోనైనా డబ్బు చెల్లించాలని దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. దీంతో అధికారులు దరఖాస్తుదారు వద్దకు మాట్లాడుతున్నా పెద్దగా ఫలితం ఉండడం లేదని సమాచారం. కాగా, మార్కెట్ ధర ఆధారంగా ఫీజు చెల్లించి స్థలాలను క్రమబద్ధీకరించుకుంటే అమ్ముకునే హక్కు వస్తుందని, బ్యాంక్‌లో రుణాలు పొందొచ్చని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అయినా స్పందన లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిని అధికారులు ఎదుర్కొంటున్నారు.

నోటీసులు ఇచ్చాం.. అవగాహన కల్పిస్తున్నాం



59 జీఓ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు స్థల విస్తీర్ణం ఆధారంగా క్రమబద్ధీకరణకు చెల్లించాల్సిన ఫీజుపై నోటీసులు ఇచ్చాం. అంతేకాకుండా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. దీంతో ఇప్పటికే ఎనిమిది మంది మొత్తం డబ్బు చెల్లించగా, మరో 12మంది మొదటి వాయిదా కట్టారు. ఇంకా మరికొందరు ఇప్పుడిప్పుడే ముందుకొస్తున్నారు.

– ఎం.శైలజ, తహసీల్దార్, ఖమ్మం అర్బన్

సౌకర్యాల కల్పనే లక్ష్యం



మోటార్ సైకిళ్లపై వెళ్తున్న మంత్రి పువ్వాడ అజయ్, తదితరులు

- 'వాడవాడ పువ్వాడ'లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి నిధులు
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఇంటింటికీ వెళ్లి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: అన్ని సౌకర్యాలు కల్పించడమే కాక ప్రజలు సంతోషంగా జీవించేలా ఖమ్మంను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. నగరంలోని 57వ డివిజన్ టూటౌన్, త్రీటౌన్ ప్రాంతాల్లో మంగళవారం ఆయన 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మోటార్ సైకిళ్లపై పర్యటించిన మంత్రి... కొత్త సీసీ రోడ్లు, డ్రెయినులు ఇతర సమస్యల పరిష్కారం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కేఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతీ వాడకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేరవేయాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు. వాడవాడ పువ్వాడలో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం మంత్రి కేటీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించారని వెల్లడించారు. సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల అసెంబ్లీ వేదికగా ఖమ్మం నగర అభివృద్ధిపై ప్రశంసలు కురిపించారని తెలిపారు.



లబ్ధిదారురాలకు ఇంటి వద్దే కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మంత్రి

98 మందికి చెక్కులు పంపిణీ

టూటౌన్, మధ్యాహ్నం త్రీటౌన్ ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి పువ్వాడ.. 98 మందికి రూ.98 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్వయంగా ఇళ్ల వద్దే లబ్ధిదారులకు అందజేశారు. పేదింటి ఆడపిల్లల వివాహానికి ఇబ్బంది పడొద్దనే రాష్ట్రప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలుచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా, మార్కెట్ చైర్మన్లు బచ్చు విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత, తహసీల్దార్ శైలజ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, టీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పొంగులేటి' సమ్మేళనం

- వైరాలో పూర్తయిన ఏర్పాట్లు
- మరో పక్క బీఆర్‌ఎస్‌కు ముగ్గురు కౌన్సిలర్ల రాజీనామా
- పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఇంకొందరు కూడా...



వైరాలో సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్, తదితరులు

వైరా: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన వైరాలో బుధవారం ఆత్మీయ సమ్మేళనం జరగనుంది. ఈమేరకు ఏర్పాట్లు పూర్తికాగా.. సమ్మేళనానికి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు వెళ్లకుండా పార్టీ నేతలు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యా రు. అయితే, పలు మండలాల్లో బీఆర్‌ఎస్ పార్టీ కి పలువురు గతంలోనే రాజీనామా చేయగా... మంగళవారం వైరా 7, 8, 20వ వార్డుల కౌన్సిలర్లతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజీనామా ప్రకటించారు. వీరికి తోడు ఐదుగురు వార్డు కమిటీ అధ్య క్షులు, ఓ గ్రామ శాఖ అధ్యక్షుడు సైతం రాజీనామా ప్రకటన చేయడం గమనార్హం.

ఇప్పటికి నలుగురు..

వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్.. పొంగులేటి వెంట వెళ్లడంతో ఆయనను బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేసిన విషయం విదితమే. మరో ముగ్గురు కౌన్సిలర్లు కూడా రాజీనామా ప్రకటించడంతో మున్సిపాలిటీలో చైర్మన్‌తో సహా నలుగురు పొంగులేటి వెంట నడుస్తున్నట్లయింది. వార్డు కౌన్సిలర్లు పణిత ఉష, కన్నెగంటి సునీత, గుగులోత్ లక్ష్మీబాయి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు దార్న రాజశేఖర్, గండగలపాడు గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ సైదులు, వార్డు కమిటీ అధ్యక్షులు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. ఇక మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ కూడా పొంగులేటి వర్గంలో కొనసాగుతున్నారు.

ఏర్పాట్లు పరిశీలన

వైరాలో పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించనుండగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఐదు మండలాల నుంచి జన సమీకరణ కోసం వారం రోజులుగా ప్రచారం చేస్తున్నారు. వైరాలోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపాన సమ్మేళనం ఏర్పాట్లను బానోత్ విజయాబాయి, మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ మంగళవారం పరిశీలించారు. కాగా, సమ్మేళనానికి అధిక సంఖ్యలో అభిమానులు హాజరుకావాలని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

మంచి దృక్పథమే విజయానికి సోపానం

జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు



అదనపు న్యాయమూర్తి దేనీరూత్‌ను సన్మానిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, న్యాయమూర్తులు

ఖమ్మంలీగల్: మంచి దృక్పథంతో ఏ పని చేసినా విజయం వరిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైన సందర్భంగా మంగళవారం న్యాయ సేవాసదనంలో మంగళవారం సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన అందరూ అభినందనీయులని కొనియాడారు. అన్నిస్థాయిల ఉద్యోగులు, న్యాయవాదుల కృషితో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.దేనీరూత్, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా మాట్లాడుతూ జిల్లా న్యాయమూర్తి దిశా నిర్దేశం వల్లే ఈ విజయం సాధ్యమైందని.. లోక్ అదాలత్‌లో 153 సివిల్ కేసులు పరిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు మాట్లాడగా, న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, న్యాయవాదులు, బీమా కంపెనీల అధికారులు, న్యాయశాఖ సిబ్బందిని సన్మానించారు. న్యాయమూర్తులు డి.రాంప్రసాదరావు, ఎం.అర్చనాకుమారి, వి.అపర్ణ, ఎస్.అమరావతి, కె.ఆషారాణి, ఎన్.శాంతిసోని, ఆర్.ఆశాలత, కోర్టు అధికారులు సూర్యనారాయణ, నాజర్, కె.రాధేశ్యాం, ఓంకార్, న్యాయవాదులు, బీమా కంపెనీల ప్రతినిధులు ఎం.నిరంజన్‌రెడ్డి, బి.గంగాధర్, ఆర్.హరిప్రసాద్, జి.హరేందర్‌రెడ్డి, కె.రామారావు, జి.సీతారామారావు, ఎస్.రాంబాబు, కె.సంధ్య, ఈ.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' కి అభినందన

జాతీయ లోక్ అదాలత్‌కు విస్తృత ప్రచారం కల్పించడంపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు 'సాక్షి'కి అభినందనలు తెలి పారు. కేసుల రాజీ వల్ల కలిగే లాభాలను వివరిస్తూ కథనాలు ప్రచురించడంతో పలువురు ముందుకొచ్చారని చెబుతూ, 'సాక్షి' విలేకరి ఇమ్మడి లక్ష్మీనారాయణను జిల్లా జడ్జి సత్కరించారు.

వాహనం ఉన్నా.. లేనట్లే!

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు గాను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గతంలో స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేశారు. అయితే, ఒక్క మిషన్‌తో పని కాకపోవడం, సిబ్బంది కొరతతో అధికారులు కొన్నాళ్లకే ఔట్ సోర్సింగ్ విధానంలో ఓ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. దీంతో సదరు ఏజెన్సీ మరో మూడు యంత్రాలు కొనుగోలు చేసి కొన్నాళ్లు పనిచేసినా.. ఆతర్వాత నాలుగింట్లో రెండు యంత్రాలను మూలన పెట్టారు. నగరంలోని ప్రధాన రోడ్లు 54 కి.మీ. మేర ఉండగా, ఇరువైపులా 108 కి.మీ. ప్రతిరోజు శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఏజెన్సీకి కేఎంసీ నుంచి నెలకు రూ.13 లక్షలు చెల్లిస్తున్నారు. కానీ రెండు వాహనాలు మూలన పడడంతో చాలాచోట్ల రహదారులను శుభ్రం చేయడం లేదనే ఆరోపణలున్నాయి. ఈవిషయమై కేఎంసీ అధికారులను వివరణ కోరగా రోడ్లను శుభ్రం చేసే బాధ్యత ఏజెన్సీదేనని స్పష్టం చేశారు. యంత్రాలతోనైనా, కార్మికులతోనైనా పని చేయించాల్సి ఉంటుందని తెలిపారు.



రోడ్డుపక్కన పెట్టిన స్వీపింగ్ మిషన్

భద్రగిరికి అన్యాయం



భద్రాచలంలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రకు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు

ముత్యాల తలంబ్రాలు తేడు.. రూ.100 కోట్లు ఇవ్వడు

- ముంపు బాధితులను ఆదుకున్నది లేదు
- ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాల్సిందే
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- ముగిసిన తొలి విడత 'హాథ్ సే హాథ్ జోడో యాత్ర'



భద్రాచలం అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన సీఎల్పీ నేత భట్టి, పొదెం వీరయ్య, వీహెచ్, సంభాని..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పాలకుల నిర్లక్ష్యంతో ఎంతో చరిత్ర కలిగిన భద్రాచలం ప్రాముఖ్యతను కోల్పోతోందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం ఆయన భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. నవాబు కాలం నుంచి నిన్నా మొన్నటి సీఎంల వరకు శ్రీరామనవమికి ముత్యాల తలంబ్రాలు అందించే సంప్రదాయం ఉండేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ దాన్ని పాటించడం లేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో భద్రాచలం ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయిస్తానని ప్రకటించి, నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఇటీవల వరదలు వచ్చినప్పుడు రూ.1000 కోట్లతో ముంపు ప్రాంత ప్రజలకు ఇళ్లు కట్టిస్తానని హామీ ఇచ్చారని, అది కూడా అతీ గతీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాముడినే మోసం చేసిన వ్యక్తి బాగుపడతాడా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

'సీతారామ' పరిహారం రూ.30 లక్షలు

సీతారామ ప్రాజెక్టులో భూ నిర్వాసితులకు 2016లో రూ. 8 లక్షలు ఇస్తామంటేనే రైతులు ఒప్పుకోలేదని, ఇప్పుడు పరిహారం చెల్లించకుండానే ప్రాజెక్టు పనులు చేపడుతున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.30 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. విద్యుత్ కోతలతో మిర్చి రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్న విషయం పాదయాత్రలో తన దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏడు మండలాలతో పాటు ఆలయ భూములు ఏపీలోకి వెళ్లాయని, కనీసం ఐదు గ్రామాలైనా తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి లేఖ రాసి భద్రాచలం పట్టణాన్ని మున్సిపాలిటీ చేయాల్సింది పోయి మూడు గ్రామ పంచాయతీలుగా విడదీసి అభివృద్ధిని పాతరేశారని విమర్శించారు.

మహబూబాబాద్‌లో పూర్తి..

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ముగిసింది. ఫిబ్రవరి 6న ములుగు జిల్లా మేడారంలో ప్రారంభమై.. 10న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది. ఆరంభంలో జిల్లా నాయకులు పెద్దగా కనిపించలేదు. బలరాంనాయక్, మల్లురవి, సీతక్క వంటి పక్క జిల్లా నేతల హడావిడే ఎక్కువగా కనిపించింది. కానీ భద్రాచలంలో యాత్ర చివరి రోజున డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రులు వీహెచ్, సంభాని చంద్రశేఖర్‌తో పాటు పలు జిల్లాల డీసీసీ అధ్యక్షులు, స్థానిక నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చప్పగా మొదలైన యాత్రకు కాంగ్రెస్ నేతలంతా కలిసి ఘనమైన ముగింపు ఇచ్చినట్టయింది.

క్లుప్తంగా

పోలీస్ అసోసియేషన్ క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సీపీ, తదితరులు

ఖమ్మంక్రైం: పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను సీపీ విష్ణు ఎస్. వారియర్ మంగళవారం ఆవిష్కరించారు. కమిషనరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ అసోసియేషన్ బాధ్యులు ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఆర్ఐ రవి, పోలీస్ అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

26న ఉమ్మడి జిల్లా మహాజన సభ

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల మ్యూచువల్లీ ఎయిడెడ్ హౌస్ బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభను ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.డీ.సలీం, టి.పంతులు తెలిపారు. ఈసమావేశానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, డ్రైవర్ల సంఘం బాధ్యులు ఎం.డీ.అబ్దుల్ హకీం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

500 వరిగడ్డి దిండ్లు దగ్ధం



కాలిపోతున్న వరిగడ్డి దిండ్లు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం ప్రమాదవశాత్తు వరిగడ్డి దిండ్లు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. రాజేశ్వరపురంలో రైతులు బత్తిని భూషయ్య, బత్తిని వీరయ్య, మెగులూరి గురవయ్య, జిల్లా నాగేశ్వరరావుకు చెందిన వరిగడ్డి వాములు పక్కపక్కనే ఉన్నాయి. మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు పడటంతో మంటలు చెలరేగి 500కుపైగా గడ్డి దిండ్లు కాలిపోయాయి. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా రాకపోవడంతో స్థానికులు నీళ్లు చల్లుతూ మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.


నేడు ఎక్సైజ్ వాహనాల వేలం

ఖమ్మంక్రైం: వివిధ నేరాల్లో స్వాధీనం చేసుకున్న తొమ్మిది వాహనాలను బుధవారం ఉదయం ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని ఎక్సైజ్ స్టేషన్–1లో వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు హాజరుకావాలని సూచించారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కూసుమంచి: మండలంలోని గంగబండ తండాకు చెందిన వడిత్య శివ(27) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసైన ఆయనను తల్లిదండ్రులు మందలించటంతో ఆత్మహత్యకు చేసుకున్నట్లు సమాచారం. అయితే, ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఓసీలో కమిషనర్ పర్యటన



సోలార్ ప్లాంట్ వివరాలు తెలుసుకుంటున్న శంకర్‌నాయక్

ఇల్లెందు: రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ గుగులోతు శంకర్‌నాయక్ మంగళవారం ఇల్లెందులోని జేకేఓసీ–5ను సందర్శించి ఉత్పత్తి, రవాణాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక వనరులున్నాయని, వాటిలో బొగ్గు ఒకటన్నారు. బొగ్గు పుట్టినిల్లు అయిన ఇల్లెందులో జేకేఓసీ–5ను సందర్శించటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం 39 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, గని మేనేజర్ పూర్ణచందర్‌రావు, ఆరెం వెంకటేశ్వర్లు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీహరి ఉన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
కందులు	7,200	6,700
మిర్చి	18,400	14,000
తాలు మిర్చి	10,200	7,500
పత్తి	7,700	6,100

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,781

నేడు సంత్ సేవాలాల్ జయంతి

- లంబాడా తెగకు ఆరాధ్యదైవం
- ఆధ్యాత్మిక మార్గం చూసిన మహరాజ్
- ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న గిరిజనులు



గోలియాతండాలో సేవాలాల్ ఆలయం, (ఇన్‌సెట్) బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్

టేకులపల్లి: ఆధ్యాత్మిక భావనలు బోధించి, బంజారా తెగలో వెలుగులు నింపారని, తమను భక్తి భావం వైపు నడిపించారని లంబాడా తెగ ప్రజలు సంత్ సేవాలాల్ మహరాజ్‌ను కొలుస్తారు. ఆయన 284వ జయంతిని బుధవారం (నేడు) జరుపుకోనున్నారు. 2016లో అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడమే కాక జిల్లాకు రూ.10 లక్షల నిధులను మంజూరు చేస్తోంది.

ఇదీ చరిత్ర..

అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని రాంజీనాయక్‌తండా (అప్పుడు ఆ ప్రాంతం కర్ణాటకలో ఉండేది)కు చెందిన బంజారా జాతి నాయకుడు రమావత్ భీమానాయక్ – ధర్మిణి దంపతులు.. అనేక పూజలు చేయగా 1739లో సేవాలాల్ జన్మించినట్లు విశ్వాసం. చిన్నప్పటి నుంచే సేవాలాల్ ఆధ్యాత్మికత భావనలతో మెలిగేవారని, పన్నెండేళ్ల ప్రాయంలోనే కలియకుండలో స్నానం (శివుని కుండము) ఆచరించేందుకని తల్లిదండ్రులకు చెప్పి ఇల్లు వదిలి వెళ్లాడని నమ్ముతారు. బంజారాల కులదేవతైన జగదాంబ బోధనలను నేర్చుకోవడమే కాకుండా వాటిని ఆచరణలో పెట్టారని, లంబాడాల సంస్కృతీ, సంప్రదాయాలు, వేషధారణను ఎవరూ మరచిపోకుండా పాటించాలని హితబోధ చేసేవారని పెద్దలు చెబుతున్నారు. అవివాహిత యువతులు జరిపే తీజ్ పండుగను ఘనంగా జరిగేలా ప్రోత్సహించేవారు. ప్రతి సంవత్సరం శివరాత్రి నుంచి శ్రీరామనవమి వరకు 41 రోజులపాటు సేవాలాల్ దీక్షలు చేపట్టేవారు. బ్రహ్మచారిగా ఉండి లంబాడాల సమాజాన్ని భక్తి భావనలతో నడిపించేందుకు దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ఆధ్యాత్మిక ప్రచారం చేసి ఎందరో జీవితాలను ప్రభావితం చేశారని గిరిజనుల నమ్మకం. అనంతర కాలంలో ఆయన సేవాలాల్ నుంచి సంత్ సేవాలాల్ మహరాజ్‌గా ప్రసిద్ధి చెందారు.

జంతుబలి నిషేధం..

భజనలు, కీర్తనలు, పాటలతో చెన్నకేశవస్వామిని, పార్వతీదేవిని నిత్యం కొలిచే సేవాలాల్ తమ జాతిలో ఉన్న జంతుబలి సహేతుకం కాదని ప్రజలను చైతన్యపరిచేవారు. అప్పటి నుంచి కుల దేవతలైన సప్త మాతృకలకు 'పొంగళి'ని నైవేద్యంగా సమర్పిస్తున్నారు. కాగా, సేవాలాల్ ఆధ్యాత్మిక శక్తి గురించి తెలుసుకున్న అప్పటి నిజాం నవాబు.. తినకూడని ఆహారాన్ని పంపించి సాదరంగా ఆహ్వానించారని, అయితే నవాబు అంతరంగాన్ని గ్రహించిన సేవాలాల్ తన పాదస్పర్శతో అమృతాహారంగా మార్చారని భక్తుల నమ్మకం. బంజారాల అవతారపురుషుడిగా, భగవంతుడిగా పూజలందుకున్న సేవాలాల్ మహరాజ్.. తాను నిర్యాణం చెందాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకు సరైన ప్రదేశం 'రూయిగఢ్' అని గ్రహించారు. అమ్మవారి అనుగ్రహంతో మూడు రోజుల్లో తిరిగి వస్తానని, తన పార్థీవశరీరాన్ని ఎవరూ తాకకుండా పదిలపర్చాలని శిష్యులకు చెప్పారు. అయితే తన కుమారుడు పరమపదించాడా అంటూ సేవాలాల్ తల్లి ఆయన పార్థివదేహంపై పడి విలపించింది. అంతవరకు ప్రకాశిస్తున్న ఆ పార్థివ దేహం తల్లి చేతి స్పర్శతో కాంతి విహీనంగా మారిపోయిందని, ఆత్మ చేరికకు అవకాశం లేకుండా పోయిందని, దీంతో రూయిగఢ్ సమీపంలో పొరాదేవి గ్రామంలో సమాధి చేశారని చెబుతారు.

టేకులపల్లిలో రెండు ఆలయాలు..

బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్‌కు టేకులపల్లి మండల కేంద్రంలో రెండు ఆలయాలున్నాయి. గోల్యాతండాలోని ఆలయంలో 35 ఏళ్లుగా, భీంసింగ్‌తండా సమీపంలో ఉన్న ఆలయంలో ఏడేళ్ల నుంచి వేడుకలు జరుగుతున్నాయి. సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ స్వచ్ఛంద సంస్థ ట్రస్ట్ చైర్మన్ ఇస్లావత్ నామానాయక్ ఆధ్వర్యంలో గోల్యాతండాలో, భూక్య గన్నానాయక్ ఆధ్వర్యంలో భీంసింగ్‌తండా సేవాగఢ్‌లో సేవాలాల్ జయంతి వేడుకలు ఏటా ఫిబ్రవరి 15న నిర్వహిస్తున్నారు.

35 ఏళ్లుగా సేవాలాల్ సేవలో..



సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్‌కి 30 ఏళ్లుగా పూజలు చేస్తున్నాను. ఎందరో కృషి ఫలితంగా సేవాలాల్ జయంతికి గుర్తింపు వచ్చింది. రాష్ట్రంలోనే తొలిసారి నేను గోలియాతండాలో సేవాలాల్ ఆలయం నిర్మించాను. జయంతి రోజు సెలవు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– ఇస్లావత్ నామానాయక్, సేవాలాల్ ట్రస్ట్ చైర్మన్

బంజారాల ఆరాధ్య దైవం..



బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్.. ఆయన చూపిన బాటలో బంజారాలు భక్తి భావంతో ముందుకు సాగుతున్నారు. టేకులపల్లిలోని భీంసింగ్‌తండా సమీపంలోని సేవాగఢ్‌లో సేవాలాల్ మహరాజ్‌కు 2017లో ప్రత్యేక ఆలయం నిర్మించాం. ఏటా ఇక్కడ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నాం.

– భూక్య గన్నానాయక్, సేవాగఢ్ ఆలయం చైర్మన్

ఉత్తీర్ణత శాతం మరింత పెరగాలి...

పలు పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు



చింతకాని : పందిళ్లపల్లిలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ



బోనకల్ : చిరునోముల పాఠశాలలో కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ, ఉపాధ్యాయులు

మధిర: రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ఆదేశించారు. మండలంలోని సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై ప్రత్యేక తరగతుల బోధన, అల్పాహారంపై సూచనలు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

చింతకాని/బోనకల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. చింతకాని మండలం పందిళ్లపల్లి, బోనకల్ మండలం చిరునోముల పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, పదో తరగతి ప్రత్యేక తరగతులు, మన ఊరు – మన బడి పనులపై సూచనలు చేశారు. అలాగే, చిరునోముల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాసిన 27కథలతో రూపొందించిన 'చిరునోముల చిన్నారుల కథలు' పుస్తకాన్ని డీఈఓ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాసిన కథలు వైవిధ్యంగా ఉన్నాయని అభినందించారు. ఈకార్యక్రమాల్లో ఎంఈఓ వై.ప్రభాకర్, హెచ్‌ఎంలు సలీం, సరిత, లక్ష్మి, చలపతిరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ వేమ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు వాసిరెడ్డి సీతారామయ్య, సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

- బాధ్యులందరిపై కేసు నమోదుకు కుటుంబీకుల డిమాండ్
- నిలిచిపోయిన పోస్టుమార్టం



ఇలవల వెంకటరెడ్డి (ఫైల్)

ముదిగొండ: రెండు నెలల క్రితం జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన రైతు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అయితే, ఘటనకు బాధ్యులైన అందరిపై కేసు నమోదు చేయాలని కుటుంబీకులు డిమాండ్ చేస్తున్న నేపథ్యాన మంగళవారం కూడా పోస్టుమార్టం జరగలేదు. దీంతో మృతుడి స్వగ్రామంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటుచేశారు. వివరాలు... మండలంలోని కమలాపురం పంచాయతీ పరిధి అయ్యగారిపల్లికి చెందిన రైతు ఇలవల వెంకటరెడ్డి (61), నాగమణి గత ఏడాది డిసెంబర్ 15న పొలంలో పని చేసుకుంటుండగా ఇరవై మంది వ్యక్తులు వచ్చి కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకట్‌రెడ్డికి ఖమ్మంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు.


మిగతా వారి పేర్లు ఏవి?

వెంకట్‌రెడ్డిపై దాడి ఘటనలో ఆయన కుమారుడు వీరాంజనేయరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు 13మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, తాము ఇరవై మందిపై ఫిర్యాదు చేసినందున అందరినీ అరెస్ట్ చేయాల్సిందేనని కుటుంబీకులు పట్టుబడ్డారు. కానీ పోస్టుమార్టం నివేదిక వచ్చాక అందరినీ విచారిస్తామని పోలీసులు చెబుతూ మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు వెంకటరెడ్డి మృతదేహం వద్ద సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్‌బాబు, నాయకులు వనం ప్రదీప్తబాబు నివాళులర్పించారు.

గ్రామంలో పోలీసు పికెట్

దాడిలో గాయపడిన వెంకట్‌రెడ్డి మృతి చెందడంతో అయ్యగారిపల్లిలో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎలాంటి ఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాస్, ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యాన పికెట్ ఏర్పాటుచేశారు. ఈక్రమంలోనే బాధ్యులందరినీ అరెస్టు చేయాలని కుటుంబీకులు డిమాండ్ చేయగా, పోలీసులు మాత్రం పోస్టుమార్టం చేయించేందుకు యత్నించినట్లు సమాచారం. దీనికి కుటుంబీకులు అంగీకరించకపోవడంతో మంగళవారం రాత్రి వరకు కూడా పోస్టుమార్టం జరగలేదు. ఈ విషయమై ఎస్సై నాగరాజును వివరణ కోరగా వెంకట్‌రెడ్డిపై దాడి ఘటనలో 20మందిపై ఫిర్యాదు చేయగా, 13మందిని విచారించి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మిగతా వారిపై పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

భద్రాచలంఅర్బన్: రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు సోమవారం మధ్యాహ్నం పట్టుకున్నారు. మంగళవారం ఏఎస్పీ పరితోష్ పంకజ్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బ్రిడ్జి చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ మధుప్రసాద్, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన ఐదుగురు వ్యక్తులు సంజీవ్‌కుమార్, అజయ్‌దేవరాయ్, గణపతిచౌహాన్, సంగేశ్‌జాదవ్, బాస్సీ బిక్కురాథోడ్ రెండు వాహనాలలో సుమారు రూ.26,40,000 విలువ గల 132 కిలోల గంజాయిని ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో కొనుగోలు తమ ప్రాంతంలో విక్రయించేందుకు తరలిస్తున్నారు. వారి వాహనాలను ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. వాహనాలు, గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించామని వెల్లడించారు. భద్రాచలంటౌన్ సీఐ నాగరాజు కేసు నమోదు చేసి ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారని ఆయన వివరించారు.

మట్టి తవ్వకాలు అడ్డగింత

రఘునాథపాలెం: మండలంలోని రఘునాథపాలెం సమీపాన గ్రీన్ కాలనీవాసులు పోలీస్ ఫైరింగ్ రేంజ్ దగ్గర పీర్లగుట్టపై మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణ సంస్థ బాధ్యులు ఇక్కడి నుంచి మట్టి తవ్వి తరలిస్తుండగా.. రాత్రీపగలు తేడా లేకుండా వచ్చి వెళ్లే వాహనాల దుమ్ముతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆరోపించారు. అలాగే, రహదారి గుంతలమయమవుతోందని పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ట్రిప్పర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో కాంట్రాక్ట్ సంస్థ బాధ్యులు చేరుకుని, మట్టి తవ్వకాలకు ప్రభుత్వ అనుమతి ఉందని నచ్చచెప్పి తవ్వకాలు సాగించారు.

అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి

ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్



జాతర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు

వైరారూరల్: మండలంలోని సొన్నాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 18నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే జాతర విజయవంతమయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సూచించారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై చర్చించారు. ఆలయం ముస్తాబు, భక్తులకు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు, పారిశుద్ధ్య పనులు, ఇతర వసతులపై సూచనలు చేశారు. అలాగే, ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురుకాకుండా జాగ్రత్త వహించాలని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం జాతర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ చైర్మన్ చింతనిప్పు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, ఏఎంసీ చైర్మన్ బీడీకే.రత్నం, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్ లాల్ మహ్మద్, ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, సర్పంచ్ అమ్మిక రామారావు, ఆలయ ఈఓ శ్రీనివాస్, తహసీల్దార్ నారపోగు అరుణతో పాటు మల్లు రామకృష్ణ, బాణాల వెంకటేశ్వర్లు, పసుపులేటి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై దాడులు ఆపాలి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: త్రిపురలో ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛగా జరిగే పరిస్థితులు కల్పించేలా చూడడంతో పాటు ప్రతిపక్షాలపై దాడులు జరగకుండా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సదస్సులో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రతిపక్షాలపై బీజేపీ నేతల హింసాత్మక చర్యలు గర్హనీయమని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు, వారి మద్దతుదారులే లక్ష్యంగా అధికార బీజేపీ నేతలు హింస, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. త్రిపురలో గురువారం జరగనున్న సీపీఎం, కాంగ్రెస్ కూటమిగా పోటీ చేస్తుండడంతో బీజేపీ అరాచకాలకు పాల్పడుతున్న విషయమై తమ పార్టీ కేంద్ర కమిటీ సోమవారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందని తెలిపారు. డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్ తదితరులు మాట్లాడగా నాయకులు మాచర్ల భారతి, వై.విక్రమ్, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దేశవాళీని.. హైబ్రిడ్‌గా మార్చి!

- ఆశాజనకంగా మిర్చి దిగుబడి
- క్వింటా రూ.48వేలకు విక్రయించిన కోయచెలక రైతు



మిర్చిబస్తాలతో వరంగల్ మార్కెట్‌లో రైతు వెంకట్

రఘునాథపాలెం: మండలంలోని కోయచెలక రైతు దేశవాళీ మిర్చి రకాన్ని అభివృద్ధి చేసి తీసుకొచ్చిన హైబ్రిడ్ రకాన్ని సాగు చేసి అత్యధిక దిగుబడి సాధించాడు. గ్రామానికి చెందిన రైతు తోట వెంకట్ ఎకరంలో మిర్చి సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో దేశవాళీ రకాన్ని పోలిన హైబ్రిడ్ రకం విత్తనాలను ఓ కంపెనీ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. దీంతో వెంకట్ సాగు చేయగా రూ.72వేల ఖర్చు వచ్చిందని చెబుతున్నాడు. ఈక్రమంలో మొదటి కోత ఏడు క్వింటాళ్ల దిగుబడి రాగా.. అందులో క్వింటా తాలు పోగా ఆరు క్వింటాళ్ల మిర్చిని వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు మంగళవారం తీసుకెళ్లి విక్రయించాడు. ఈక్రమంలో క్వింటాకు రూ.48 వేల చొప్పున ధర రాగా.. మరో ఏడు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతు వెంకట్ చెబుతున్నాడు. కాగా, కొత్త రాకిన్న సాగు చేసి అధిక దిగుబడి సాధించడమే కాక మంచి ధర పలికిన నేపథ్యాన రైతును వరంగల్ మార్కెట్‌లో పలువురు రైతులు సన్మానించారు. ప్రయోగాత్మకంగా మార్కెట్‌లోకి తీసుకొచ్చిన మిర్చి రకంతో సాగు చేసిన తనకు ఖర్చులు పోగా ఎకరానికి ఇప్పటికే రూ.2లక్షల మేర ఆదాయం లభించిందని రైతు హర్షం చేస్తున్నాడు.

'రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న బీఆర్‌ఎస్..'



మాట్లాడుతున్న కుంజా సత్యవతి

చర్ల: రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ అప్పులపాలు చేస్తోందని, ఆ పార్టీని సీఎం కేసీఆర్‌ను తెలంగాణ నుంచి తరిమికొట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి పిలుపునిచ్చారు. మంగళవారం చర్లలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్రమే నిధులు విడుదల చేస్తోందని, ఆ నిధులతోనే గ్రామాలలో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణాలు, రైతు వేదికల నిర్మాణాలు, వైకుంఠధామాల వంటి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 'సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది'అన్న చందంగా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంతోపాటు రాముడు నడయాడిన భద్రాద్రిగడ్డపై కాషాయ జెండా ఎగరాలని ఆమె ఆకాంక్షించారు. సమావేశంలో నాయకులు ముత్తవరపు రత్తయ్య, బిట్రుగుంట క్రాంతికుమార్, పాశిగంటి సంతోష్‌కుమార్, నక్కా కన్నయ్య, పుగాకు పూర్ణచందు, కొండేటి చంద్రశేఖర్, ఆలెం సమ్మయ్య, ఎడవల్లి శేషగిరి, చిడెం గోపి, సాధం లోకనాథం, తోటమల్ల శ్రీనివాస్, మద్దెల ఉపేందర్, పుప్పాల రంజిత్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ ఖమ్మం – వరంగల్ X రోడ్ దగ్గర నందనవనం టౌన్షిప్‌లో వెంటనే గృహప్రవేశానికి అనువైన 2BHK డీలక్స్ హౌస్ అమ్మబడును. ధర 60 లక్షలు, బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. సంప్ర।। 9248123419. [M-1190575]

PLAT FOR SALE

■ Vaishnavi Ventures : అందిస్తున్న అద్భుత అవకాశం కేవలం 1 లక్షతో మొదలుకొని 6వేలు నెలవారి EMI తో విలువైన ఓపెన్ ప్లాట్లు సొంతం చేసుకోండి. సంప్ర।। 9030644798. [M-1190537]

■ 1) Iconic Infra(Hyd) సాగర్ హైవే ఫేసింగ్ యాచారం DTCP ప్లాట్లు Nr. ఫార్మాసిటీ & 85ఎ।। HMDA లేఅవుట్ విజయవాడ హైవే@ చౌటుప్పల్ RRR ప్రక్కన 9154102338 [HA-10737]

Services

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237 [T-P1751]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786676]

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడను. సంప్ర: 9603055647, 7995392747 [G-971]

Wanted

■ ఉద్యోగ అవకాశాలు నెలకు 20,000/- నుండి 1 లక్ష వరకు సంపాదించుటకు అవకాశం. Contact: 9550558589. [M-1190530]

■ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాచే స్థాపించిన SBI లైఫ్ ఇన్సూరెన్స్ నందు పార్ట్ టైం / ఫుల్ టైం పనిచేయుటకు ఏజెంట్స్ కావలెను. 10th అర్హతతో 30 సం।।లు నిండినవారు అర్హులు. సెల్: 9704288693. [M-1168326]

■ ప్రముఖ కంపెనీ నందు ఆఫీస్ ఇన్‌చార్జెస్ స్త్రీ/పు కావలెను. Age : 27 పైన, Qly.: Inter ఆపైన. శాలరీ : 7000–30,000/-, ఖమ్మం, కోదాడ. A.K. చౌదరి, సెల్ : 81424 92999. [M-1190521]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779895]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు, కావలెను, ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18 k ఏజెంట్స్ కమీషన్ 3k ఫోన్: 7569955551, 9848571888. [H-786836]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9705444182, 9010299957

కొత్తగూడెం : 9010223783

పాల్వంచ : 9705444183

భద్రాచలం : 9951602914

క్లుప్తంగా...

'ఈనాడు' వ్యాజ్యాలు కొట్టివేత

- ప్రభుత్వ జీవోల అమలు నిలుపుదలకు ఏపీ హైకోర్టు నిరాకరణ
- ఏబీసీని నిరోధించాలన్న అభ్యర్థన కూడా తిరస్కృతి



సాక్షి, అమరావతి: విస్తృత సర్క్యులేషన్ కలిగిన ఏదైనా ఓ దినపత్రికను కొనుగోలు చేసేందుకు సచివాలయాలు, వలంటీర్లకు నెలకు రూ.200 ఆర్థిక సాయాన్ని అందచేస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోల అమలును నిలిపివేయాలన్న 'ఈనాడు'అభ్యర్థనను ఆ రాష్ట్ర హైకోర్టు తోసిపుచ్చింది. వలంటీర్లు, సచివాలయాల ద్వారా జరిగే 'సాక్షి'దినపత్రిక కొనుగోళ్లను పరిగణనలోకి తీసుకోకుండా ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్ (ఏబీసీ)ను ఆదేశించాలన్న అభ్యర్థనను సైతం తోసిపుచ్చింది. ఈ మేరకు ఈనాడు దాఖలు చేసిన రెండు అనుబంధ వ్యాజ్యాలను కొట్టివేసింది. నిర్దిష్టంగా ఫలానా పత్రికను మాత్రమే కొనుగోలు చేయాలంటూ వలంటీర్లు, సచివాలయాలను ప్రభుత్వం ఆదేశిస్తున్నట్లుగా ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదని ధర్మాసనం గుర్తు చేసింది. రూ.200 ఆర్థిక సాయాన్ని వలంటీర్లు, సచివాలయాలు 'సాక్షి'దినపత్రికను మాత్రమే కొనుగోలు చేయాలన్న లక్ష్యంతో ఇచ్చారా? లేదా? అన్న విషయాన్ని లోతైన విచారణ జరిపి తేలుస్తామని స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా 'ఈనాడు'చేస్తున్న ఆరోపణల ఆధారంగా 'సాక్షి'కొనుగోళ్లను పెంచుకునేందుకు ప్రభుత్వం రూ.200 ఆర్థిక సాయం చేస్తోందన్న ప్రాథమిక నిర్ణయానికి ఈ దశలో రాలేమని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ప్రస్తావించిన కీలకాంశాలను పరిగణలోకి తీసుకుంటే ఇది సాక్షి – ఈనాడు మధ్య వ్యాపార సంబంధిత వివాదమని ధర్మాసనం అభిప్రాయపడింది. సాధారణంగా ఇద్దరి మధ్య జరిగే ఇలాంటి వ్యాపార యుద్ధాల్లో న్యాయస్థానాలు మధ్యంతర ఉత్తర్వుల దశలో అరుదుగా మాత్రమే జోక్యం చేసుకుంటాయని వ్యాఖ్యానించింది.

సురక్షిత 'యాత్ర'

- పర్యాటకులు, భక్తుల భద్రతకు ఏపీలో 20 టూరిస్ట్ పోలీసు స్టేషన్లు
- వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఏపీ ముఖ్యమంత్రి జగన్



సాక్షి, అమరావతి: ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు వ్యవస్థలో పలు సంస్కరణలు తెస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో మహిళా పోలీసు వ్యవస్థను అందుబాటులోకి తేవడంతోపాటు రాష్ట్రంలో జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. సంస్కరణల్లో భాగంగా పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో పర్యాటకులు, యాత్రికుల భద్రత కోసం టూరిస్ట్ పోలీసు స్టేషన్లను తాజాగా అందు బాటులోకి తెస్తున్నట్లు ప్రకటించారు. ఏపీ వ్యాప్తంగా 20 ప్రాంతాల్లో టూరిస్ట్ పోలీసు స్టేషన్లను మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే...

పర్యాటకులకు సౌకర్యాలు, భద్రత

పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించే వారి భద్రత కోసం ప్రత్యేకంగా 20 ప్రాంతాలను గుర్తించి కియోస్క్‌లు ఏర్పాటు చేశాం. అవి స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుబంధంగా 20 అదనపు పోలీస్ స్టేషన్లుగా పని చేస్తాయి. ప్రతి కియోస్క్‌లో ఆరుగురు సిబ్బంది రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. దీన్ని ఎస్ఐ లేదా ఏఎస్ఐ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ఆపదలో చిక్కుకునేవారు సంప్రదించేందుకు ప్రత్యేకంగా టెలిఫోన్ నంబరు డిస్‌ప్లే చేస్తారు. కియోస్క్‌లలో సిబ్బందికి ప్రత్యేక టెలిఫోన్ నెంబరు, రేడియో సెట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఆ ప్రాంతానికి సంబంధించిన మ్యాపు, వాహనాల సదుపాయం కల్పించాం. పర్యాటకులు, యాత్రికులు నిర్భయంగా గడిపేలా భరోసా కల్పిస్తూ టూరిస్ట్ పోలీసు స్టేషన్లు పని చేస్తాయి. టూరిస్ట్ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించే సిబ్బందిలో సగం మంది మహిళలు ఉన్నారు. అక్కచెల్లెమ్మలు కియోస్క్‌లకు వెళ్లినప్పుడు మహిళా సిబ్బంది తోడుగా నిలబడతారు.

టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు ఇలా..

- విశాఖపట్నం జిల్లా: ఆర్కే బీచ్
- కాకినాడ జిల్లా: కుక్కుటేశ్వర స్వామి దేవాలయం
- తూర్పు గోదావరి జిల్లా: పుష్కర ఘాట్
- ఏలూరు జిల్లా: ద్వారకా తిరుమల
- కృష్ణా జిల్లా: మోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం, మంగినపూడి బీచ్
- ఎన్టీఆర్ జిల్లా: విజయవాడ కనకదుర్గ ఆలయం, భవానీ ద్వీపం, పవిత్ర సంగమం ఘాట్
- ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా: మైపాడు బీచ్, పెంచలకోన దేవాలయం
- కర్నూలు జిల్లా: మంత్రాలయం దేవాలయం
- నంద్యాల జిల్లా: మహానంది, ఆహోబిలం ఆలయం
- అన్నమయ్య జిల్లా: హార్సిలీ హిల్స్
- వైఎస్సార్ జిల్లా: గండికోట, ఒంటిమిట్ట దేవాలయం
- శ్రీసత్యసాయి జిల్లా: లేపాక్షి దేవాలయంలతో పాటు మరో రెండు పర్యాటక ప్రాంతాలు.

లింగమనేని రమేష్ నిలువునా ముంచాడు

- విద్యాసంస్థల విస్తరణకు భూములు అప్పగిస్తానని లింగమనేని సంప్రదించారు
- పలు దఫాలుగా ఆయనకు రూ.310 కోట్లు ఇచ్చాను
- ఇప్పటిదాకా భూములు రిజిస్ట్రేషన్ చేయలేదు.. నగదూ ఇవ్వడం లేదు
- శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ విద్యాసంస్థల విస్తరణకు అవసరమైన భూములు, భవనాలను ఇస్తానని చెప్పి లింగమనేని రమేష్ తన దగ్గర నుంచి రూ.310 కోట్లు తీసుకున్నారని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు ఆరోపించారు. అయితే ఇంతవరకు భూములు, భవనాలు అప్పగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని ఒక హోటల్‌లో మంగళవారం తన న్యాయవాదులతో కలసి బీఎస్ రావు మీడియాతో మాట్లాడారు. 2012లో విద్యా సంస్థల విస్తరణకు తనకు 300 ఎకరాల భూములు అవసరమయ్యాయన్నారు. ఈ క్రమంలో వాటిని తాను ఇస్తానని లింగమనేని రమేష్ తనను సంప్రదించాడని చెప్పారు. ఈ క్రమంలో పలుమార్లు రూ.310 కోట్ల నగదును ఆయనకు ఇచ్చానని బీఎస్ రావు తెలిపారు. భూములు, భవనాలను సేకరించి ఇవ్వలేకపోతే తానిచ్చిన మొత్తం నగదును వడ్డీతో సహా చెల్లిస్తామని లింగమనేని 2013లో తనతో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. అయితే ఇప్పటివరకు ఒక ఎకరం భూమి కూడా అప్పగించలేదని వాపోయారు. భూములు అప్పగించాలని తాను అనేక సార్లు అడిగితే 2015లో భూములను కొని.. రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని లింగమనేని తనతో ఎంవోయూ చేసుకున్నారని తెలిపారు. అది కూడా నేరవేర్చలేదన్నారు. తర్వాత జరిగిన మధ్యవర్తిత్వాలతో తనకు 15 చెక్కులను ఇచ్చారని.. వాటిని బ్యాంక్‌ల్లో జమ చేసినప్పుడు బ్యాంకులకు స్టాప్ పేమెంట్ అని లింగమనేని సమాచారం ఇచ్చారన్నారు. దీంతో బ్యాంకులు ఆ చెక్కులను తిరస్కరించాయని తెలిపారు.

హైదరాబాద్‌లో లింగమనేనిపై కేసు..

రమేష్ మోసం చేస్తున్నారని గ్రహించి హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఆయన గ్రూప్‌లపై క్రిమినల్ కేసు పెట్టామని బీఎస్ రావు చెప్పారు. దీంతో పోలీసులు లింగమనేని రమేష్, లింగమనేని రాజశేఖర్, లింగమనేని స్వర్ణకుమారి, లింగమనేని ప్రశాంతి, లింగమనేని సుమానా, కాకర్ల వినయ్‌లపై ఆరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారన్నారు. నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, హైకోర్టుల్లో కూడా కేసులు వేశామని తెలిపారు. తనకు ఇచ్చిన చెక్కుల్లో 20 శాతం నగదును చెల్లించాల్సిందిగా రమేష్ గ్రూప్‌నకు కోర్టులు ఆదేశాలు జారీ చేశాయన్నారు. అయినా తనకు నగదు ఇవ్వలేదని బీఎస్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ 6వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్.. లింగమనేని రమేష్ గ్రూప్‌నకు చెందిన స్థిర, చరాస్తులను రెవెన్యూ యాక్టు కింద అటాచ్ చేసి తనకు ఇవ్వాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినా స్పందన లేదన్నారు. లింగమనేని రమేష్ కంపెనీలపై చెన్నైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో ఐదు కేసులను దాఖలు చేశామని.. అవి పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సుప్రీం కోర్టు కూడా 18 శాతం వడ్డీతో వాయిదాల వారీగా నగదు మొత్తం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినా రమేష్ పాటించడం లేదన్నారు.

బీఎస్ రావు ఆరోపణలు అవాస్తవం: లింగమనేని రమేష్

బీఎస్ రావు ఆరోపణలు పూర్తిగా అవాస్తవం.. నిరాధారం. చైతన్య విద్యా సంస్థల గ్రూప్‌నకు, మా గ్రూప్‌నకు మధ్య ఆర్థిక, వ్యాపార వివాదాలు ఉన్న మాట నిజమే. అయితే ఆయనను మోసం చేశామని బీఎస్ రావు ఆరోపించడం అవాస్తవం. ఈ అంశాలన్నీ కోర్టు పరిధిలో ఉన్నాయి. ఇప్పటివరకు ఏ న్యాయస్థానం మేము తప్పు చేసినట్లు తీర్పు ఇవ్వలేదు.

ఏబీవీపై చర్యలు తీసుకోండి

- రెండు స్టేజ్‌ల టైమ్‌స్కేల్ తగ్గించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఆదేశం
- కుమారుడికి అడ్డగోలు ప్రయోజనం కలిగించేందుకే ఆ కాంట్రాక్టు
- సీనియర్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు తీరుపై నిగ్గుతేల్చిన యూపీఎస్సీ



సాక్షి, అమరావతి: నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ)పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం.. ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయనకు రెండు స్టేజీల టైమ్‌స్కేల్ తగ్గించాలని తెలిపింది. 2024, మే 31వరకు ఇది అమలులో ఉంటుందని పేర్కొంది. ఏబీవీపై రెండు అభియోగాలు నిరూపితమయ్యాయని వెల్లడించింది. నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించిన ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసిన ప్రభుత్వం ఆయనపై తదుపరి చర్యల కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. ఆయనపై మూడు అభియోగాల్లో ఒకటి పూర్తిగానూ మరొకటి పాక్షికంగానూ నిర్ధారణ అయ్యాయని యూపీఎస్సీ కేంద్ర హోంశాఖకు నివేదించింది. ఇజ్రాయెల్ కంపెనీ నుంచి నిఘా పరికరాల కొనుగోలు ద్వారా తన కుమారుడు చేతన్ సాయికృష్ణ భాగస్వామిగా ఉన్న కంపెనీకి ప్రయోజనం కలిగించేందుకు ఏబీవీ యత్నించారని.. అఖిల భారత సరీ్వసు నిబంధనలకు సైతం విరుద్ధంగా వ్యవహరించారని తెలిపింది. దాంతో ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అఖిల భారత సర్వీసు నిబంధనలు–1969 ప్రకారం ఆయనపై తదుపరి చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టంచేసింది.

కుమారుడికి అడ్డగోలు కాంట్రాక్టు కోసమే

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు నిబంధనలకు విరుద్ధంగా నిఘా పరికరాల కొనుగోలుకు సిద్ధపడ్డారని యూపీఎస్సీ నిర్ధారించింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఇన్‌ఫ్లేమబుల్ లిమిటెడ్, ఆర్‌టీఎల్‌టీఏ కంపెనీల నుంచి ఏరోస్టాట్, యూఏవీ నిఘా పరికరాల కొనుగోలుకు ఏకపక్షంగా నిర్ణయించారు. తద్వారా భారత్‌లో ఆ కంపెనీ ప్రతినిధిగా ఉన్న ఆకాశం అడ్వాన్స్ సిస్టమ్స్‌కు అయాచిత లబ్ధికి ప్రయత్నించారు. మరోవైపు.. ఏబీవీ కుమారుడు చేతన్‌సాయి ఆకాశం అడ్వాన్స్ సిస్టమ్స్‌కు సీఈఓ కావడం గమనార్హం. తన ఉన్నతాధికారుల అనుమతిలేకుండా ఏబీవీ ఏకపక్షంగా వ్యవహరించారు. పరికరాల నాణ్యత, గ్యారంటీ, నిర్వహణ కాలం మొదలైన సాంకేతిక ప్రమాణాలను తగ్గించి మరీ ఆమోదించేశారు. విధి నిర్వహణలో ఉత్సుకతతోనే ఇలా చేశానన్న ఏబీ వెంకటేశ్వరరావు వాదనను యూపీఎస్సీ తిరస్కరించింది.

ఎన్ఈపీపై కేంద్ర వర్సిటీల ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: జాతీయ విద్యా విధానం–2020 అమలుకు సంబంధించిన అంశంపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్‌కుమార్ మంగళవారం 45 కేంద్ర విశ్వవిద్యాలయాల వైఎస్ చాన్స్‌లర్లతో ఆన్‌లైన్ వేదికగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వర్సిటీలు ఎన్ఈపీ అమలులో వారి అనుభవాలను, అవసరమైన సలహాలు, సూచనలు వెల్లడించాయి. సమీక్షలో వెల్లడైన ముఖ్యమైన అంశాలను యూజీసీ మీడియాకు వెల్లడించింది.

- కేంద్ర విశ్వవిద్యాలయాలన్నీ అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ పోర్టల్‌లో నమోదు చేసి, విద్యార్థుల వివరాలను ఆన్‌బోర్డ్ చేస్తున్నాయి. అన్ని కేంద్ర వర్సిటీలూ యూజీ, పీజీ స్థాయిలో ఎగ్జిట్ పాలసీ, బహుళ ప్రవేశానికి సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించాయి. అవసరమైన మార్పులకు శ్రీకారం చుట్టాయి. కఠినమైన అంశాలను తొలగించాయి.
- విద్యార్థుల్లో విలువలు, నైపుణ్యం, సమకాలీన అంశాలపై పట్టు పెంచేలా పాఠ్య ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నాయి. వృత్తి విద్యలో మరిన్ని కోర్సులు పెంచుతున్నాయి. ఫీల్డ్ అనుభవాన్ని పెంచేందుకు ప్రాధాన్యమిస్తున్నాయి. పరిశోధనకు అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇంక్యుబేషన్, ఇన్నొవేషన్, ఆధునిక పరిశోధన కేంద్రాల స్థాపనపై దృష్టి పెడుతున్నాయి.
- క్రెడిట్స్ బదిలీ కోసం స్వీయ నిబంధనలు రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఏకీకృత పాఠ్యబోధన ప్రణాళిక వైపు అడుగులేస్తున్నాయి.

స్కూలు పిల్లలకు 'వనదర్శిని' అవగాహన

సాక్షి, హైదరాబాద్: అడవులు, పర్యావరణంపై వాటిని కాపాడాల్సిన ఆవశ్యకతను వనదర్శిని కార్యక్రమం ద్వారా స్కూల్ విద్యార్థులకు అటవీశాఖ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయి విద్యార్థుల నుంచే పర్యావరణ ప్రాధాన్యత, అటవీ పరిరక్షణ ఆవశ్యకతను గురించి వివరిస్తున్నారు. ఇందులో భాగంగా అడవులను కాపాడాలన్న సంకల్పాన్ని పిల్లల్లో కల్పనకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు జిల్లాల్లో నిర్వహిస్తున్న వనదర్శిని కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోంది. స్కూలు విద్యార్థులను అడవుల్లోకి తీసుకెళ్లి అక్కడి వివిధ రకాల చెట్లు, ఔషధ మొక్కల గురించి అటవీ అధికారులు పరిచయం చేశారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉండే అడవుల వల్ల ఉపయోగాలు, అడవులపై పెరుగుతున్న ఒత్తిడిని విద్యార్థులకు అర్థం అయ్యేలా వివరిస్తున్నారు. తాజాగా మేడ్చల్ జిల్లా అటవీశాఖ నేతృత్వంలో కీసర రిజర్వ్ ఫారెస్ట్‌లో వనదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులను కీసర అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్న కీసర ఎకో అర్బన్ పార్క్‌ను విద్యార్థులు సందర్శించి సేద తీరారు. విద్యార్థుల వనదర్శిని కార్యక్రమం వివరాలను ట్విట్టర్‌లో షేర్ చేసిన సంతోష్ ఆనందాన్ని వ్యక్తంచేశారు.

జిల్లా వార్తలు

సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం

ధర్నాలో బీఎంఎస్ జాతీయ నాయకుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న బీఎంఎస్ నాయకుడు లక్ష్మారెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పర్మనెంట్ కార్మికులతో పోలిస్తే కాంట్రాక్టు కార్మికులే ఎక్కువ పనిచేస్తున్నప్పటికీ అన్యాయమే జరుగుతోందని బీఎంఎస్ జాతీయ నాయకుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో బీఎంఎస్ ఆధ్వర్యాన హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ పరిపాలనకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను నిర్వీర్యం చేయడమే కాక ఆస్తులను తరలిస్తోందని ఆరోపించారు. కోలిండియాలో కాంట్రాక్ట్ కార్మికులకు రోజుకు రూ.930 చెల్లిస్తుండగా, సింగరేణిలో మాత్రం రూ.430 చెల్లించడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా సమాన పనికి సమాన వేతనం చెల్లించడమే కాక సింగరేణిలో పర్మనెంట్, కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి జాబ్‌చార్ట్‌లు రూపొందించాలన్నారు. బీకేఎంఎస్ కార్యదర్శి పి.మాధవనాయక్ మాట్లాడుతూ స్వరాష్ట్రంలో సింగరేణి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోగా, నిధుల దోపిడీ జరుగుతోందని మండిపడ్డారు. ఇకనైనా బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనేలా ప్రభుత్వం ఆదేశించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీఎంఎస్ నాయకులు ఎం.రమాకాంత్, పులి రాజిరెడ్డి, పవన్‌కుమార్, పేరం రమేశ్, ఎ.మాధవరెడ్డి, సంగం చందర్, అప్పాని శ్రీనివాస్, మొగిలిపాక రవి తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఆధ్వర్యాన పండ్ల తోటల వేలం

భద్రాచలం: జిల్లాలోని గరిమెళ్లపాడు నర్సరీలో మామిడి, సపోటా, నిమ్మ, కొబ్బరి తోటలను రెండేళ్ల కాలాని(2023–25)కి వేలం వేయనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. ఈనెల 23వ తేదీ ఉదయం 11గంటలకు నర్సరీలో వేలం మొదలవుతుందని, ఆసక్తి ఉన్న వారు రూ.3 వేల దరావత్తు చెల్లించి హాజరుకావాలని సూచించారు. కాగా, నర్సరీలో చెట్ల పరిశీలనకు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిదినాల్లో అనుమతిస్తామని తెలిపారు.

'సుకన్య సమృద్ధి'లో ఖమ్మం టాప్

- నూతనంగా 4,266 ఖాతాలు ప్రారంభం
- తెలంగాణ పోస్టల్ సర్కిల్‌లోనే ఖమ్మం డివిజన్ ఫస్ట్
- ఆడపిల్లలందరి పేరిట ఖాతాలు తెరిచేలా అవగాహన
- ఇప్పటికే పలువురు విద్యార్థినులకు లబ్ధి



మణుగూరు అంగన్‌వాడీ సెంటర్‌లో సుకన్య పథకంలో బాలికలను బాండ్లు అందజేస్తున్న తపాలా ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: సుకన్య సమృద్ధి యోజన పథకం అమలులో ఖమ్మం తపాలా డివిజన్(ఉమ్మడి జిల్లా) రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని మరింతగా ప్రోత్సహించింది. దీంతో తపాలా శాఖ దేశవ్యాప్తంగా 'అమృత్ పెక్స్ ప్లస్' పేరిట ఈనెల 9, 10, 11 తేదీల్లో సుకన్య సమృద్ధి యోజన అకౌంట్లపై మహామేళా నిర్వహించింది. ఈ మేరకు తెలంగాణ పోస్టల్ సర్కిల్ పరిధిలో 34,384 ఖాతాలు తెరవగా.. ఇందులో అత్యధికంగా ఖమ్మం డివిజన్‌లో 4,266 ఖాతాలు ప్రారంభమయ్యాయి. దీంతో సుకన్య సమృద్ధి యోజన ఖాతా ప్రారంభోత్సవ మహామేళాలో తెలంగాణ సర్కిల్‌లో ఖమ్మం డివిజన్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ఈ పథకాన్ని 2015లో ప్రారంభించగా, తెలంగాణ తపాలా సర్కిల్‌లో ఇప్పటివరకు 8,62,776 మంది అర్హులైన బాలికలు చేరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 89,996 మంది ఖాతాలు తెరవగా, ఖమ్మం డివిజన్‌లో 10,005 మంది చేరినట్లు అధికారులు వెల్లడించారు.

బాలికల భవిష్యత్‌కు వరం

సమాజంలో ఆడపిల్లలకు సమాన అవకాశాలు, ఉద్యోగాలు, ఉన్నతమైన చదువులు అందించడం ద్వారా భ్రూణ హత్యలను అరికట్టాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'బేటీ బచావో.. బేటీ పడావో' నినాదంతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా బాలికల కోసం ప్రత్యేకంగా 'సుకన్య సమృద్ధి యోజన' పథకాన్ని తపాలా శాఖ ద్వారా అమలుచేస్తోంది. అప్పుడే పుట్టిన శిశువు మొదలు పదేళ్ల వయస్సు కలిగిన ఆడపిల్లల పేరిట ఈ ఖాతాను తెరవొచ్చు. ఈ పథకంలో ఆడపిల్లల పేరిట ఏటా రూ.250నుంచి రూ.1.50లక్షల వరకు పదిహేనేళ్ల డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఖాతా తెరిచిన నాటి నుంచి 21ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ రానుండగా.. బాలికకు 18 ఏళ్లు నిండినప్పుడు ఉన్నత విద్య కోసం ఖాతాలోని 50 శాతం మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. వివాహం కోసం కూడా ముందస్తుగానే ఉపసంహరించుకునే అవకాశాన్ని కల్పించారు. ఈ పథకం ద్వారా అత్యధికంగా 7.6 శాతం వడ్డీ రేటు అమల్లో ఉండగా... ఆదాయపు పన్ను రాయితీ కూడా కల్పించారు.

'సుకన్య' మహామేళాలో రాష్ట్రంలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన డివిజన్లు

డివిజన్	మేళాలో ప్రారంభించిన ఖాతాలు
ఖమ్మం	4,266
సికింద్రాబాద్	3,858
కరీంగనర్	3,803
హైదరాబాద్ సౌత్, ఈస్ట్	2,629
నల్లగొండ	2,239

ఉన్నత విద్య కోసం...



విమల భావన

ఖమ్మం డివిజన్ పరిధిలోని భద్రాచలం పట్టణానికి చెందిన విమల భావన ఇంజనీరింగ్ విద్య అభ్యసించేందుకు తన సుకన్య సమృద్ధి యోజన ఖాతాలో నుంచి రూ.6,87,800 పొందారు. ఇంకా చింతకాని మండలం పాతర్లపాడుకు మర్రి సౌమ్య కూడా మెడికల్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం పథకాన్ని వినియోగించుకుంటోంది.



మర్రి సౌమ్యకు చెక్కు అందిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

ఇలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మరో ఐదుగురు విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారని తపాలా అధికారులు వెల్లడించారు.

ఆడ పిల్లల భవిష్యత్‌కు భరోసా



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్లల భవిష్యత్‌కు అండగా ఉంటుంది. ఆడపిల్లల తల్లిదండ్రులు నిర్దేశించిన వయసులో సుకన్య ఖాతాను తెరిస్తే మంచిది. బాలిక చదువు, వివాహం ఇతర అవసరాలకు ఉపయోగపడుతుంది. సమీప తపాలా కార్యాలయం లేదా పోస్టుమ్యాన్‌ను సంప్రదిస్తే వివరాలు వెల్లడిస్తారు. – బి.రవికుమార్, పోస్టల్ సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

నిత్యాన్నదానానికి విరాళాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి మంగళవారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఎన్‌సీ పద్మావతి రూ.50 వేలు, గజ్వేల్‌కు చెందిన రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు రూ.86 వేలు ఆలయ అధికారులకు అందజేశారు. వారు దాతలకు రసీదులు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులకు, దాతల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



దాతకు రసీదును అందజేస్తున్న ఆలయ సిబ్బంది

పుంజుకున్న మిర్చి ధర

ఖమ్మం మార్కెట్‌లో క్వింటాకు రూ.18,400



ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర కాస్త ముందడుగు వేసింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజా రకం మిర్చి క్వింటాకు మంగళవారం రూ.18,400 ధర పలికింది. సోమవారం రూ.18,150 ఉండగా, రూ.250 మేర పెరిగినట్లయింది. ఈనెల 1వ తేదీ నుంచి రూ.18,050 నుంచి రూ.18,200 మధ్య ధర లభిస్తుండగా కాస్త పెరగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. చైనా, తదితర దేశాల నుంచి వస్తున్న ఆర్డర్లతో వ్యాపారులు ధర పెంచి కొనుగోళ్లకు పోటీ పడుతున్నారు. జిల్లాలో మిర్చిని తామరపురుగు(నల్లి) ఆశించగా ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంలేదు. దీంతో వ్యాపారుల ఆర్డర్లకు తగినట్లు పంట రాని కారణంగా ధర పెంచుతున్నట్లు తెలుస్తోంది. కాగా, గరిష్ట ధర 18,400గా పలికినా ఎక్కువ సరుకుకు మాత్రం రూ.17,800 మాత్రమే ధర లభించినట్లు రైతులు వెల్లడించారు. తాలు మిర్చి ధర సైతం క్వింటాకు రూ. 10,200గా పలికింది. మంగళవారం మార్కెట్‌కు మొత్తంగా 52,213 బస్తాల మిర్చిని రైతులు విక్రయానికి తీసుకురాగా, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం కొనుగోళ్లను పర్యవేక్షించారు.

నేతకాని కులస్తులకు హక్కు పత్రాలు ఇవ్వాలి

ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్ కోటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు

గంగారం: నేతకాని కులస్తులకు పోడు పట్టాలివ్వాలని ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ జనగాం కోటేశ్వర్‌రావు కోరారు. భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల నేతకాని కులస్తుల సన్నాహక సమావేశం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం దుబ్బగూడెంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులతో పాటు అడవిలో జీవిస్తున్న నేతకాని కులస్తులకు పోడు భూముల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. 1920 కంటే ముందు నుంచే రాష్ట్రంలో నేతకాని కులస్తులున్నట్లు అప్పటి నిజాం గెజిట్ తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఆ తర్వాత కర్ణాటక, మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేతకాని కులస్తులు జీవిస్తున్నట్లుగా 1956, 1970తో పాటు ఇప్పటి గెజిట్ల ద్వారా తెలుస్తోందని చెప్పారు. గిరిజనులతో పాటు ఈ ప్రాంతంలో పుట్టి పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నందున నేతకాని కులస్తులకు ఏజెన్సీలో నివసించే హక్కుతో పాటు భూమిపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా నేతకానిలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో త్వరలోనే వరంగల్‌లో భారీ సభను నిర్వహిస్తామని కోటేశ్వర్‌రావు తెలిపారు. సమావేశంలో ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం నగేశ్‌తోపాటు దుర్గం సమ్మయ్య, రాజం నర్సయ్య, జనగాం వీరస్వామి, పెంటయ్య, చెన్నూరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులూ.. ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాద్

మహబూబాబాద్: విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ జిల్లా చైర్మన్ పీవీ ప్రసాద్ సూచించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మంగళవారం హిమోగ్లోబిన్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శరీరంలో హిమోగ్లోబిన్ తగ్గిపోతే ఆరోగ్య సమస్యలు పెరుగుతాయని చెప్పారు. అలా జరగకుండా ఆకుకూరలు, ఇతర పౌష్టికాహారం తీసుకోవాలని, బాల్యవివాహాల కారణంగా ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ వైస్‌చైర్మన్ డాక్టర్ నెహ్రూ, రావుల రవిచందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'యువశక్తి'

చుంచుపల్లి: జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన 'కొత్తగూడెం యువశక్తి' పేరుతో యంగ్ లీడర్స్ వర్క్ షాప్‌ను త్వరలో నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్ డాక్టర్ గడల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిష్ణాతులైన లీడర్‌షిప్ కోచ్‌ల ద్వారా రెండు రోజుల ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. యువతను మంచి మార్గంలో నడిపించడంతో పాటు భవిష్యత్ దిశానిర్దేశం చూపేలా నిర్వహించనున్న ఈ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేర్ల నమోదుతో పాటు పూర్తి వివరాలకు 95040 06999 నంబర్‌లో సంప్రదించాలని శ్రీనివాసరావు సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పెనుబల్లి: నిరుద్యోగ యువతీ, యువకులకు బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడమే కాక ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఐటీసీ ప్రథమ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రాం తెలిపారు. 18 నుండి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి 8వ తరగతి నుండి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన వారు 91776 41543 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈమేరకు భద్రాచలంలోని శిక్షణ కేంద్రంలో బ్యూటీషియన్ కోర్సు, బూర్గంపాడులో ఎలక్ట్రీషియన్ శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతితో పాటు స్టడీ మెటీరియల్, షూ, బ్యాగ్స్ ఇస్తామని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

కేటీపీఎస్ ఐదో దశలో నిలిచిన విద్యుదుత్పత్తి

పాల్వంచ: భద్రాద్రి జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ ఐదో దశ కర్మాగారంలో మంగళవారం ఉదయం పది గంటల సమయాన విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 10వ యూనిట్ బాయిలర్ ట్యూబ్ లీకేజీ ఏర్పడటంతో అధికారులు ట్రిప్ చేశారు. అనంతరం సీఈ ఎం.ప్రభాకర్ రావు నేతృత్వాన యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. బుధవారం తెల్లవారుజాము వరకు ఉత్పత్తి మొదలయ్యే అవకాశముందని సమాచారం.

మార్కెట్‌లోకి హీరో మోటోకార్ప్ 'గ్జూమ్'



గ్జూమ్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ గణేష్, పక్కన ఎండీలు హరిబాబు, రంగనాథ్

ఖమ్మంగాంధీచౌక్: హీరో మోటోకార్ప్ ఆధ్వర్యాన రూపొందించిన సరికొత్త స్కూటర్ గ్జూమ్‌ను ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. నగరంలోని హీరో షోరూంలో మంగళవారం ఈ వాహనాన్ని నగర ఏసీపీ పీ.వీ.గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ ఆటోమొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్లు ఈశ్వరప్రగఢ హరిబాబు, భార్గవప్రసాద్, రంగనాథ్ మాట్లాడుతూ హీరో గ్జూమ్ వాహనం 110 సీసీ ఇంజన్, కార్నర్ బెండింగ్ లైట్లు, ఎల్ఈడీ హెడ్ ల్యాంప్, బ్లూటూత్ కనెక్టివిటీ, డిజిటల్ స్పీడోమీటర్ తదితర ప్రత్యేకతలతో రూపొందించినట్లు తెలిపారు.

నాగపూర్ ఆస్పత్రిలో కూసుమంచి మహిళ

- పదేళ్ల తర్వాత ఆచూకీ చెప్పడంతో విచారణ



కూసుమంచి: మానసిక స్థితి సక్రమంగా లేక మహారాష్ట్రలోని నాగపూర్‌కు చేరి అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ(35) పదేళ్ల తర్వాత కోలుకుంది. ఈ సందర్భంగా ఆమెను ఆరా తీయడంతో తనది ఖమ్మం జిల్లా కూసుమంచి అని చెప్పడంతో ఆచూకీ కోసం పోలీసులు విచారణ చేపట్టారు. అక్కడి ప్రభుత్వ మానసిక చికిత్స నిలయంలో 2013లో ఓ మహిళను చేర్పించగా ఆమెకు ఇన్నాళ్లుగా వైద్యం అందిస్తున్నారు. ఈక్రమంలో మామూలు స్థితికి చేరుకున్నాక తన పేరు గీతాంజలి అని, తనది కూసుమంచి అని ఆమె చెప్పడంతో మంగళవారం నాగపూర్ ఆస్పత్రి వైద్యులు కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డికి ఫోన్ చేసి విషయాన్ని తెలిపారు. దీంతో అక్కడి ఆస్పత్రి వైద్యులు పంపించిన మహిళ ఫొటోను పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ ఆచూకీ కోసం ఆరా తీస్తున్నట్లు సీఐ తెలిపారు. సదరు మహిళ వివరాలు తెలిసిన వారు 87126 59132(సీఐ) 87126 59133(ఎస్సై) నంబర్లకు తెలపాలని ఆయన కోరారు.

డిగ్రీ పరీక్ష కేంద్రం మార్పు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు న్యాక్ బృందం పరిశీలన నేపథ్యంలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షల కేంద్రాన్ని మార్పు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం, గురువారం నిర్వహించాల్సిన పరీక్షలను పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తామని చెప్పారు. శుక్రవారం నుంచి యథావిధిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు ఈ మార్పును గుర్తించి సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.



ప్లాస్టిక్ బ్యాగుల్లో మిర్చి నింపుతున్న కార్మికులు





పది కిలోల చొప్పున మిర్చితో సిద్ధం చేసిన బస్తాలు

మన మిర్చి విదేశాలకు!

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజ రకం మిర్చిని కొనుగోలు చేస్తున్న జిల్లా వ్యాపారులు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లాతో పాటు సమీపంలోని భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో రైతులు పండించే తేజ రకం మిర్చికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. అక్కడి నుంచి వచ్చే ఆర్డర్లకు అనుగుణంగా కొనుగోళ్లు చేపడుతున్న స్థానిక వ్యాపారులు మరోసారి ఆరబెట్టి గ్రేడింగ్ చేశాక.. అవసరమైతే తొడిమెలు తీయించి పది కిలోల చొప్పున ప్లాస్టిక్ సంచుల్లో నింపుతారు. అనంతరం చెన్నై, కాకినాడకు లారీల్లో తరలించి అక్కడ నుంచి ఓడల్లో వివిధ దేశాలకు రవాణా చేస్తున్నారు. జిల్లా నుంచి ప్రధానంగా చైనా దేశానికి తేజ రకం మిర్చి రవాణా జరుగుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

– ఖమ్మం వ్యవసాయం



లారీలోకి మిర్చి బస్తాలు లోడ్ చేస్తున్న కార్మికులు

వందేభారత్ రైలుకు నెల!

- ఖమ్మం నుంచి పెరుగుతున్న రాకపోకలు
- తిరుపతి మార్గంలో ఏర్పాటుచేయాలని విన్నపాలు

ఖమ్మం మామిళ్లగూడెం: సికింద్రాబాద్ నుండి ఖమ్మం మీదుగా విశాఖపట్నం వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై బుధవారంతో నెల పూర్తి కానుంది. గత నెల 15న ఈ రైలును ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించిన విషయం విదితమే. సికింద్రాబాద్ నుండి విశాఖపట్నంకు కేవలం ఎనిమిది గంటల వ్యవధిలో వెళ్లే ఈ రైలుకు ఖమ్మంలో మంచి ఆదరణ లభిస్తోంది. తొలినాళ్లలో ఖమ్మం నుంచి ఐదు నుంచి పది మాత్రమే ప్రయాణించగా.. ఇప్పుడు ఆ సంఖ్య 50 నుండి 60కి చేరింది. ఇదే తరహాలో రోజురోజుకు ప్రయాణికుల సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ఖమ్మం నుండి వరంగల్, సికింద్రాబాద్, వరంగల్, అటు విజయవాడ, రాజమండ్రికి అధికంగా ప్రయాణికులు వచ్చివెళ్తున్నారు. తద్వారా ప్రతిరోజు ఆదాయం రూ.11లక్షల మేర నమోదవుతుందని అధికారిక అంచనా.

విమాన ప్రయాణం అనుభూతి

విమానంలో ప్రయాణించాలని ఆశించే వారు వందేభారత్ రైలులో ప్రయాణించడం ద్వారా తృప్తి పడుతున్నారు. అత్యాధునిక సీటింగ్, రైలు వెళ్తుండగా ప్రకృతిని ఆస్వాదించేలా అద్దాలతో కూడిన బోగీలు ఈ రైలు ప్రత్యేకత. దీంతో చార్జీలు కొంత ఎక్కువే అయినా పలువురు ఈ రైలులో ప్రయాణించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈనెల రోజుల్లో కేవలం రెండు రోజులు మాత్రమే రైలు కొంత ఆలస్యంగా నడిచినా, మిగతా అన్ని రోజుల్లో సమయానికే వచ్చివెళ్తోంది. సికింద్రాబాద్ వెళ్లే మార్గంలో ఉదయం 11 గంటలకు, విశాఖపట్నం వెళ్లే మార్గంలో సాయంత్రం 5–45 గంటలకు రైలు ఖమ్మం వస్తోంది. కాగా, వందేభారత్ రైలును తిరుపతికి కూడా నడిపించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



ఖమ్మం స్టేషన్‌లోకి వస్తున్న వందేభారత్ రైలు



గతనెల 15న రైలును ప్రారంభిస్తున్న ఎంపీలు నామ నాగేశ్వరరావు వద్దిరాజు రవిచంద్ర తదితరులు

హయ్యర్ పెన్షన్ అమలుపై స్పష్టత ఇవ్వండి

- ఆర్టీసీ పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు
- ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వజ్రాల శ్రీనివాసరావు

ఖమ్మంమామిళ్లగూడెం: ఆర్టీసీ కార్మికులకు హయ్యర్ పెన్షన్ అమలుతో పాటు ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ విషయమై ఆర్టీసీ యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రాల శ్రీనివాసరావు కోరారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో బాణాల రాంబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన రీజినల్ జనరల్ బాడీ సమావేశంలో శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులకు అమలు చేయాల్సిన రెండు వేతన సవరణలు, స్క్రాప్ బస్సుల స్థానంలో కొత్తవి కొనే అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. అలాగే, కార్మికులపై పనిభారం తగ్గించి, ప్రయాణికుల అవసరాల మేరకు బస్సుల సంఖ్య పెంచాలన్నారు. కాగా, ఆర్టీసీ పరిరక్షణ కోసం సంస్థలోని కార్మిక సంఘాలన్నీ సమైక్య పోరాటానికి సిద్ధం కావాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ రవాణా విధానం మూలంగా ఆర్టీసీ నష్టాల పాలవుతోందని, ఇందులో భాగంగా మార్చి 12 నుండి 19వ తేదీ వరకు చేపట్టనున్న ఆర్టీసీ పరిరక్షణ వారాన్ని జయప్రదం చేయాలని శ్రీనివాసరావు కోరారు. ఖమ్మం రీజియన్‌లో సర్వీసులు పెంచిన నేపథ్యాన గతంలో ఇతర రీజియన్లకు బదిలీ చేసిన డ్రైవర్లు, కండక్టర్లు తిరిగి ఖమ్మంకు కేటాయించాలని ఆయన యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం భారత కార్మిక సంఘాల కేంద్రం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణం వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి మాట్లాడగా రాష్ట్ర, జిల్లా నాయకులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్.కే.పర్వీన్, తోకల బాబు, గుండు మాధవరావు, వేము జాకబ్, కుదుదల వెంకన్న, చింతలచెరువు వెంకటకష్టారెడ్డి, కూరపాటి రామారావు, భూక్యా బాలకృష్ణ, ఎస్.రమాదేవి, డి.సరిత, కె.పద్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

మధిరలో కోర్టు నిర్మాణానికి రూ.21 కోట్లు

మధిర: మధిరలో కోర్టు భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.21 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం హైకోర్టు రిజిస్ట్రార్ నిధుల కేటాయింపులతో కూడిన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న పాత భవనం స్థానంలో రెండంతస్తులతో కూడిన నిర్మాణాలను చేపట్టనున్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు సివిల్ జడ్జి కోర్టుల నిర్వహణతో పాటు భవిష్యత్ అవసరాల మేరకు మరో రెండు కోర్టులను నిర్వహించేలా భవనాలు నిర్మిస్తున్నారు. తాజాగా జరిగిన శాసనసభ సమావేశాల్లో మధిర ఎమ్మెల్యే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మధిర కోర్టు శిథిలావస్థకు చేరడంతో తాత్కాలికంగా పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు నిధుల కోసం విన్నవించినా స్పందించకపోవడంపై సభాముఖంగా ప్రశ్నించిన ఆయన మధిరలో డ్రెయినేజీలు, నూతన కోర్టు నిర్మాణానికి నిధుల కేటాయించాలని కోరారు దీంతో సానుకూలంగా స్పందించిన సీఎం కేసీఆర్ రూ. 21 కోట్లను తక్షణం మంజూరు చేస్తూ న్యాయశాఖ ద్వారా హైకోర్టుకు తెలియజేశారు. ఈమేరకు హైకోర్టు రిజిస్ట్రార్ ఖమ్మం జిల్లా జడ్జిని ఉదహరిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.



జిల్లా జడ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు చెబుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల హర్షం

సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపై ప్రభుత్వంతో పాటు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, జిల్లా కోర్టు న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి విజయసేన్‌రెడ్డికి న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావును మంగళవారం ఖమ్మంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈకార్యక్రమంలో మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావుతో పాటు కట్టా పూర్ణచంద్రరావు, నంబూరు జనార్దన్‌రావు, కోట జ్ఞానేశ్, నెల్లూరు రవికుమార్, రెంటపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు చేయండి

- భక్తులు ఇబ్బంది పడకుండా సౌకర్యాల కల్పన
- దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా ఏసీ సులోచన

ఖమ్మంగాంధీచౌక్: మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని పూజలు నిర్వహించేందుకు ఆలయాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాటుచేయాలని దేవాదాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని దేవాదాయ శాఖ పర్యవేక్షకులు, ఆలయాల ఈఓలు, మేనేజర్లతో శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచన మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ఉచిత దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేయడమేకాక శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం, వీఐపీ దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి క్యూలైన్లు, బందోబస్తు, శానిటేషన్, రవాణా, తాగునీరు, పార్కింగ్, వైద్య శిబిరాలపై చర్చించాలని, నాణ్యమైన ప్రసాదాలను అందుబాటులో ఉండేలా చూడాలని, దాతల సహకారంతో పాలు, మజ్జిగ ఇవ్వాలని చెప్పారు. ఇంకా కోనేర్ల వద్ద, స్నానాలు చేసే కేంద్రాలు, కల్యాణకట్టల వద్ద అవసరమైన చర్యలు చేపట్టాలని, సమాచార, సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

కాగా, క్యూ లైన్లలో ఇబ్బంది పడకుండా సహాయకులను నియమించాలని, ఎలాంటి ఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా పోలీసులతో చర్చించాలని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. అవసరమైన చోట ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియమించుకోవాలని పేర్కొన్నారు.

జీఎస్టీ శాఖ తీరుతో పన్నుల భారం

ధర్నాలో 'చాంబర్' ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: వస్తు సేవా పన్నుల శాఖ నిర్వాకం కారణంగా పత్తి వ్యాపారులపై అదనపు పన్నుల భారం పడుతోందని ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు ఆరోపించారు. జీఎస్టీ శాఖ తీరును నిరసిస్తూ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మంగళవారం వర్తక సంఘం భవనం నుంచి నగరంలోని వీడీవోస్ కాలనీలో ఉన్న కేంద్ర జీఎస్టీ కార్యాలయం వరకు నల్ల బ్యాడ్జీలతో ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టి అసిస్టెంట్ కమిషనర్ రాజారత్నాకర్‌రావుకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో చిన్ని కృష్ణారావు మాట్లాడుతూ 2017 నుంచి జీఎస్టీ అమలవుతుండగా, అన్ని రకాల పంట ఉత్పత్తులకు అమ్మకం పన్ను విధిస్తూ పత్తిపై మాత్రం కొనుగోళ్లపై పన్నులను విధిస్తున్నారని వాపోయారు. తొలినాళ్లలో వ్యాపారులు అన్ని పంటల మాదిరే పత్తికి కూడా అమ్మకంపై పన్ను చెల్లించగా, ఇప్పుడు కొనుగోళ్లపై కూడా పన్ను చెల్లించాలని నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జీఎస్టీ చీఫ్ కమిషనర్, రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి హరీష్‌రావును కలిసి విన్నవించడంతో వారు సానుకూలంగా స్పందించినా న్యాయం జరగలేదని చెప్పారు. ఎగుమతి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నల్లమల ఆనంద్, చెరుకూరి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ రెండోసారి కూడా చెల్లించాలని ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. ఈ సమావేశంలో చాంబర్ ప్రతినిధులు సోమా నర్సింహారావు, మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, ఆర్వీ నాగేశ్వరరావు, నల్లమోతు లక్ష్మయ్య, సత్యంబాబు, కల్వకుంట్ల గోపాల్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం కేంద్ర జీఎస్టీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యాపారులు

నా భర్త రౌడీషీటర్.. మీ అంతు చూస్తాడు!

పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్ భార్య హల్‌చల్

ఖమ్మంక్రైం: 'నా భర్త రౌడీషీటర్.. మీ అంతు చూస్తాడు.. ఆయన ఎన్నో సెటిల్‌మెంట్లు చేశాడు' అంటూ ఓ రౌడీషీటర్ భార్య ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి హల్‌చల్ చేసింది. సీఐ శ్రీధర్ కథనం ప్రకారం... రౌడీషీటర్ అయిన పేరెల్లి ప్రవీణ్‌కుమార్ రెండో భార్య జ్యోతి పోలీసుస్టేషన్‌కు వచ్చి పోలీసులు కోర్టు ద్వారా సీజ్ చేసిన దస్తావేజులను తనకి ఇవ్వాలని, లేకపోతే పోలీసులు తనను వేధిస్తున్నట్లుగా తప్పుడు కేసు పెడతానంటూ కేకలు వేసింది. ఈక్రమంలో ఆమెను అడ్డుకునేందుకు మహిళా సీఐ, కానిస్టేబుళ్లు యత్నించినా ఆగకపోగా, దుర్భాషలాడుతూ సిబ్బందిపైనే దాడి చేసిందని చెప్పారు. స్టేషన్ ఎదురుగా రహదారిపై బైఠాయించి వాహనదారులను అడ్డుకున్న ఆమె, తన భర్త రౌడీషీటర్ అంటూ బెదరించిందని పేర్కొన్నారు. జ్యోతి హంగామా సృష్టించడం వెనుక ప్రవీణ్ ఉన్నట్లు గుర్తించగా, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నారాయణ స్కూల్‌కు సెలవు!

- తల్లిదండ్రులకు వాట్సప్ ద్వారా సమాచారం
- బోధన కుంటుపడుతోందని తల్లిదండ్రుల ఆవేదన
- రంగంలోకి దిగిన డీఈఓ, పాఠశాలలో తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

మధిర: ఎలాంటి కారణం లేకుండానే మధిరలోని నారాయణ స్కూల్‌కు మంగళవారం సెలవు ప్రకటించారు! 'నారాయణ... నారాయణా' శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితం కాగా.. అధికారులు రంగంలోకి దిగారు. ఈ సమాచారం ముందుగానే తెలిసిందో ఏమో కానీ నారాయణ పాఠశాల యజమాన్యం తల్లిదండ్రులకు వాట్సప్ ద్వారా సెలవు మెసేజ్ పంపించారు. కొందరు విద్యార్థులకు విషయం తెలియక పాఠశాలకు వచ్చి వెనుదిరిగారు. ఎలాంటి అనుమతులు లేకుండా నారాయణ స్కూల్ యాజమాన్యం పాఠశాలలు అక్రమంగా నడపడం, ఓ భవనం పేరిట అనుమతి తీసుకుని ఇంకో భవనంలో స్కూల్ నిర్వహణ తదితర అక్రమాలపై 'సాక్షి'లో కథనంలో ప్రస్తావించిన నేపథ్యాన అధికారులు తనిఖీ రావడంతో స్కూల్‌కు సెలవు ఇవ్వడం గమనార్హం. జిల్లాలోని ఇదే నారాయణ విద్యాసంస్థలు కొనసాగినా కేవలం మధిరలో సెలవు ప్రకటించడంతో విద్యాబోధన కుంటుపడుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, తనకు డబ్బు రావాల్సి ఉందని చెబుతూ భవన యజమాని బోనగిరి నారాయణరావు కార్యాలయ గదికి తాళం వేశారు. అయితే, తరగతి గదులకు కూడా తాళం వేస్తారనే ఉద్దేశంతో యజమాన్యం ముందుగానే సెలవు ప్రకటించి ఉంటుందని సమాచారం.



సెలవు ప్రకటించిన మధిరలోని నారాయణ పాఠశాల భవనం (ఇన్‌సెట్) స్కూల్ కార్యాలయానికి వేసిన తాళం



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖర్‌శర్మ, పక్కన ఎంఈఓ ప్రభాకర్

ఇప్పటికే ఫీజులు చెల్లించాం...

మధిర పట్టణానికి చెందిన ఆవుల కృష్ణ తన ఇద్దరు పిల్లలు దినేష్‌కుమార్, శ్రావణిని పది, ఎనిమిదో తరగతి చదివించేందుకు నారాయణ స్కూల్‌లో చేర్పించాడు. ఇప్పటికే ఫీజు మొత్తం చెల్లించగా, స్కూల్‌ను మూసివేస్తారనే ప్రచారంతో ఆయన మంగళవారం వచ్చి ఆరా తీశాడు. సమయం, సందర్భంగా లేకుండా సెలవు ఇవ్వడం అనుమానాలకు తావిస్తోందని, అధికారులు స్పందించాలని కోరాడు. అలాగే, సింగు విజయ్ కూడా తన కుమార్తెలను పాఠశాలలో చేర్పించి ఇప్పుడు ఇబ్బంది పడుతున్నట్లు వాపోయాడు.

కఠిన చర్యలు తీసుకుంటాం ...

'సాక్షి'లో కథనంలో స్పందించిన డీఈఓ సోమశేఖర శర్మ మధిరలో నారాయణ స్కూల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా సెలవు లేకున్నా మధిరలో నారాయణ స్కూల్ వారు సెలవు ఎందుకు ఇచ్చారో తెలియదని పేర్కొన్నారు. అయితే, ఖమ్మం కవిరాజు నగర్‌లో అనుమతి లేకుండా నడుస్తున్న నారాయణ ఒలంపియాడ్ స్కూల్, సత్తుపల్లిలో నిబంధనలు పాటించని స్కూల్‌ను మూసివేస్తామని తెలిపారు. ఇదేసమయాన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ వై.ప్రభాకర్ ఉన్నారు.

సీజ్ చేస్తాం...

నారాయణ యజమాన్యం ఒక చోట అనుమతి తీసుకుని మరో చోట బస్సులు నడుపుతున్న అంశాన్ని 'సాక్షి' కథనంలో ప్రస్తావించగా జిల్లా రవాణా శాఖ అధికారి కిషన్‌రావు స్పందించారు. అనుమతికి విరుద్ధంగా నడుస్తున్న బస్సులను సీజ్ చేస్తామని ఓ ప్రకటనలో వెల్లడించారు.